

అమ్మన్యూస్ పాఠకులకు, శ్రేయోభిలాషులకు, వీక్షకులకు, శ్రీరామ నవమి శుభాకాంక్షలు





EXCLUSIVE

చామల కిరణ్ అంటే యూత్ లో ఓ క్రేజ్. కిరణన్న అంటే ఓ ఉత్సాహం.. ఓ వైబ్రేషన్. యూత్ కాంగ్రెస్ నుండి అంచెలంచెలుగా ఎదిగి పార్లమెంటు స్థాయికి చేరిన నాయకుడు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వాసం గెలిచిన యోధుడు


FLASH EDITION
WWW. AMMADAILY.COM
EVENING 5PM

AMMA NEWS
డిజిటల్

మంగళవారం
16 ఏప్రిల్ 2024




## గల్ఫ్ కార్మికులకు సీఎం భరోసా

గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులతో భేటీ

2లో..



## ఖమ్మం గుమ్మంలో వినోదరావు జోరు

బీజేపీ ముమ్మర ప్రచారం

2లో..



## కడియం కాస్కో.. ఇక కబడ్డీ ఆడుడే..

నిప్పులు చెరిగిన మాజీ మంత్రి తాటికొండ రాజయ్య

2లో..

# పక్కా లోకల్

## నా గెలుపు ఫైనల్

### బూర బుర్ర ఊదుకోవాల్సిందే...

### అమ్మన్యూస్‌తో భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి

నర్సయ్య తాత ఇంటర్వ్యూలో సరికొత్త అంశాలు

చామల గెలిస్తే యువతకు ఉపాధి హబ్‌గా భువనగిరి పార్లమెంట్

ఎయిమ్స్, ఔటర్ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే

మా గ్యారంటీల మీద జనాలకు నమ్మకం

ఆగస్ట్ 15లోపు రైతు రుణమాఫీ ఐతది

కులాలు ముఖ్యం కాదు సంస్కారం ముఖ్యం

కెసిఆర్ రాష్ట్ర ఖజానా ఖాళీ చేసిండు



"నేను పక్కా లోకల్. నా గెలుపును ప్రజలు ఫైనల్ చేశారు. మాది తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం. ఈ లోక్ సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కంచుకోట. నా గెలుపుతో భువనగిరి కి సరికొత్త దశదిశ వస్తుందని ప్రజలు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రజాపాలన, కోమటిరెడ్డి బ్రదర్స్, ఎమ్మెల్యేలు, నాయకులు, పార్టీ కార్యకర్తల సహకారంతో ప్రజాదీవెనతో భువనగిరి ఖిల్లాపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం అని భువనగిరి లోక్ సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.

అమ్మన్యూస్ ప్రతినిధి,
ఎలక్షన్ వింగ్

# పక్కా లోకల్

EXCLUSIVE

**అమ్మన్యూస్, భువనగిరి:** బీజేపీని గెలిపిస్తే కష్టకాలం వస్తుందని భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా భువనగిరి పార్లమెంట్ పరిధిలో అసెంబ్లీ స్థాయి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. కేంద్రంలో మళ్లీ మోడీ అధికారంలోకి వస్తే డాక్టర్ బాబాసాహెబ్ రాసిన రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తారని ఆరోపించారు. మోడీకి మూడోసారి ఓటు వేస్తే నియంతలా పరిపాలిస్తారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ వైఫల్యాలను ఏ విధంగానైతే ఎండగట్టామో అదే విధంగా బీజేపీ పాలనను ఎండగట్టాలన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో సమతుల పరిపాలన కొనసాగించిందన్నారు. మోడీ వైఫల్యాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లాలని, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి మోడీ పాలను ఎండగట్టాలన్నారు.

## జైల్లో కవిత బతుకమ్మ ఆడుతుంది: ఎమ్మెల్యే కోమటిరెడ్డి

కేసీఆర్ కుటుంబం మాయమాటలతో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ఆగమాగం చేసిందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు. కిరాయి ఇళ్లలో ఉండే జగదీశ్వర్ రెడ్డి 100 ఎకరాల సంపాదన, బంగ్లాలు, రూ. 1000 కోట్ల ఆస్తి ఎలా వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. 2014లో స్కూటర్ పైన తిరిగే జగదీశ్వర్ రెడ్డి వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంతో పాటు జగదీశ్వర్ రెడ్డి కూడా జైలుకెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. కవిత తీహార్ జైల్లో బతుకమ్మ ఆడుతుందని కామెంట్స్ చేశారు. మునుగోడు ఎన్నికలలో అధికారం అడ్డుపెట్టుకొని ఫోన్ ట్యాపింగ్ చేసి తన ఓటమికి కారణమయ్యాడని ఆరోపించారు. సిగ్గు తెచ్చుకుని ఇంట్లో కూర్చో జగదీశ్వర్ రెడ్డి ఎక్కువ మాట్లాడితే రోడ్లమీద తిరగనివ్వం.. ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. అధిష్టానం కిరణ్ కుమార్ రెడ్డికి టికెట్ కేటాయించిందని, ఆయనను గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని, భారీ మెజార్టీతో గెలిచిపించాలన్నారు. రాబోయే రోజులలో ఇచ్చిన హామీలను కచ్చితంగా నెరవేరుస్తామని, ఆగస్టు 15 లోపు రెండు లక్షల రైతు రుణమాఫీని కచ్చితంగా అమలు చేస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

## చామల గెలుపు ఖాయమైంది: బీర్ల ఐలయ్య

10 సంవత్సరాలు దగా పడ్డ తెలంగాణ అభివృద్ధి కావాలని ప్రభుత్వ విప్, ఆలేరు బీర్ల ఐలయ్య అన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలని, తల్లి సోనియమ్మ రాష్ట్రాన్ని ఇచ్చిన కూడా బ్రతుకులు మారలేదన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయం అయిందని, రెట్టింపు ఉత్సాహంతో 25 రోజులు కష్టపడి పనిచేసే భారీ మెజారిటీగా అందించాలని సూచించారు.15 ఎంపీ సీట్లు కచ్చితంగా గెలవబోతున్నామమని ధీమాను వ్యక్తం చేశారు. ఆగస్టు 15 లోపు 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చెప్పారు. ఈ సమావేశంలో టీపీసీసీ వార్ రూమ్ ఛైర్మన్ పవన్ మల్లాది, యూత్ కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి సోనీ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, డీసీసీ అధ్యక్షులు సంజీవరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాష్ నేత, భువనగిరి మున్సిపల్ ఛైర్మన్ పోతం శెట్టి వెంకటేశ్వర్లు, ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ ససిరెడ్డి నారాయణరెడ్డి, వలిగొండ జడ్పీటిసి వాకిటి పద్మ, భువనగిరి మాజీ మున్సిపల్ ఛైర్మన్ బర్రె జహంగీర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.













# రాగిడి జోరు.. జనంతో హుషారు




## భర్త గెలుపు కోసం ప్రచార రంగంలోకి రజినీ

## మల్కాజ్‌గిరిలో గులాబీ పార్టీ హవా

**అమ్మన్యూస్, హైదరాబాద్:** మల్కాజ్ గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి అనూహ్య రీతిలో కార్యకర్తల మద్దతు లభిస్తోంది. సార్వత్రిక ఎన్నికల కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో వడివడిగా కదులుతున్నారు. రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు నియోజకవర్గాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పాగా వేయాలనే లక్ష్యంతో ప్రచారంలో జోరును పెంచుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన స్థానాల్లో సత్తా చాటేలా పార్టీలు ప్రచార వేగాన్ని పెంచాయి. సికింద్రాబాద్‌లో గులాబీ జెండా రెపరెపలాడేలా కారు పార్టీ వ్యూహాలు రచిస్తోంది. అందుకు అనుగుణంగానే రాగిడి లక్ష్మారెడ్డి ప్రచారాన్ని ఉధృతం చేసి ప్రజల్లోకి వెళుతున్నారు. మంగళవారం ఉదయం హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని కర్మన్ ఘాట్‌లో పురాతన దేవాలయం ప్రసన్నాంజనేయ (ధ్యానంజ నేయ) స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు రాగిడి లక్ష్మారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వాదం అందించారు. ప్రజలంతా చల్లగా ఉండాలని, హనుమాన్ కి ముడుపు కట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మళ్ళీ వచ్చి మొక్కులు చెల్లించుకుంటానని అన్నారు.

### ప్రచారంలో రాగిడి రజినీ జోరు..

ప్రధానంగా రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి రాగిడి రజినీ మరో మారు వార్తల్లో నిలిచింది. గత కొంతకాలంగా మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తూ ఎన్నికల ప్రచారంలో బిజీ బిజీగా దూసుకుపోతున్నారు. అయితే నేను కూడా మీ వెంటే అంటూ లక్ష్మారెడ్డి విజయం కోసం రంగంలోకి దిగారు. గత నాలుగైదు రోజులుగా ఆమె ఎండ సైతం లెక్కచేయకుండా ప్రణాళికా బద్ధంగా పర్యటిస్తున్నారు. తన భర్త రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఆమె ప్రతి ఇల్లు తిరుగుతూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ప్రధాన వీధుల వెంట ఉన్న వివిధ రకాల వ్యాపార దుకాణం దారుల వద్దకు వెళ్లి విచిత్ర స్థాయిలో ఓట్లను అడుగుతున్నారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరిస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల నుంచి వచ్చే వివిధ రకాల సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నారని హామీ ఇస్తున్నారు. ముఖ్యంగా నిత్యం ప్రజాసేవలో కొనసాగే వారు కావాలో..? లేక చుట్టపు చూపుల వచ్చిపోయే వారు కావాలో..? మీరే ఎంచుకోవాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. రాగిడి లక్ష్మారెడ్డి గెలిస్తే మల్కాజ్‌గిరి ప్రాంతం మరింత అభివృద్ధిలో పయనిస్తుందని వివరిస్తున్నారు.



### సమస్యలపై కృషి చేస్తానని హామీ

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతిరోజు ఉదయం వాకర్స్ ను లక్ష్మారెడ్డి కలుస్తున్నారు. మంగళవారం ఉప్పల్ నియోజకవర్గంలోని కాకతీయ నగర్ హరితవనంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, రాగిడి రజినీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వాని సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. వాటి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారి యోగక్షేమాలు అడుగుతూ బీఆర్ఎస్ పార్టీకి మీరందరు మద్దతు తెలిపాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా నియోజకవర్గ సన్నాహాక సమావేశాల్లో కూడా పాల్గొంటున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలో వచ్చిన ఫలితాలను ఎంపీ ఎన్నికల్లోనూ పునరావృతం చేయాలని ఆకాంక్షించారు.

# దూసుకెళ్తున్న నీలం
# పెరుగుతున్న బలం

కాంగ్రెస్ గూటికి ప్రధాన పార్టీల నేతలు

కేసీఆర్ సన్నిహితుడు సైతం జంప్..

మధన్నా మీ వెంటే అంటున్న ప్రజలు



**(అమ్మన్యూస్, మెదక్):** లోక్‌సభ ఎన్నికల వేళ మెదక్ సెగ్మెంట్‌లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. నాడు బీఆర్ఎస్‌లో చేరిన నేతలంతా నేడు యూటర్న్ తీసుకొని కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. మరోవైపు ఎక్కడ చూసినా, ఎవరిని కదిపినా నీలం మా బలం..., నీ వెంటే మేముంటాం.. అంటూ ప్రజలంతా ప్రతినబూనుతుండటం విశేషం. దీంతో కాంగ్రెస్ అభ్యర్థికి రోజురోజుకు బలం పెరుగుతోంది. హస్తం హవాకు నీలం బలం తోడవడంతో ప్రతిపక్షాలు బిత్తరచూపులు చూస్తున్నాయి. యువ నాయకుడి సైన్యం యావత్ నియోజకవర్గాన్ని చుట్టొస్తూ, జరుగబోయే అభివృద్ధిని వివరిస్తుం డడంతో ఓటర్లంతా స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్లు కనిపిస్తోంది. ఇందిరా గాంధీతో ముడిపడిన సెంటిమెంట్, రాష్ట్రమంతా వీస్తున్న పార్టీ గాలి కలగలిపి నియోజకవర్గం మళ్లీ గత వైభవాన్ని సంతరించుకోవడానికి తహతహలాడుతోంది. సీనియర్లు సంఘటితంగా సాగడం., పదేళ్ల నిరీక్షణ తర్వాత పగ్గాలు చేజిక్కిన కేడర్ ఉత్సాహం తొణికిసలాడుతుండడంతో గెలుపు తేలికే, మెజార్టీ మిగిలిందిక అన్నట్టుగా ప్రచారం సాగుతోంది. తప్పులు దొర్లకుండా, అవకాశం చేజారకుండా, ఐక్యతా రాగం వినిపిస్తూ, అందరినీ కలుపుకుని దూసుకెళ్తున్న నీలం ముందు చూపునకు ఇతరపార్టీలు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి.

## మళ్లీ కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు తిరుపతిరెడ్డి యత్నం

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మెదక్ అసెంబ్లీ టికెట్ ఆశించగా కాంగ్రెస్ అధిష్టానం నిరాకరించింది. దీంతో తిరుపతిరెడ్డి ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లోకి వెళ్లాడు. ఆయనతో పాటు నియోజకవర్గంలో ముఖ్య నాయ కులను సైతం తీసుకెళ్లాడు. ప్రస్తుతం తిరుపతిరెడ్డి, ఆయన వర్గం పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

అందరూ ఇలా కాంగ్రెస్ బాట పడితే నీలం మధు గెలుపు నల్లేరుపై నడకే కానుంది.



## తిరిగి హస్తం గూటికి..

నాడు బీఆర్ఎస్‌లో చేరిన వారు తిరిగి హస్తం గూటికి చేరుతున్నారు. తాజాగా నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, మెదక్ మున్సిపల్ చైర్మర్షీ సహ పలువురు కాంగ్రెస్‌లో చేరారు. మెదక్ మున్సిపల్ చైర్మర్షీ చంద్రపాల్‌తో పాటు కౌన్సిలర్లు నర్మద, లక్ష్మీనారాయణ, రుక్మిణి, గోదల మానస, రాగి వనజ, ముఖ్య నాయకులు సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 15 రోజుల క్రితం ఆరుగురు కౌన్సిలర్లు ఎమ్మెల్యే రోహిత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తిరిగి వీరంతా హస్తం గూటికి చేరుతున్నారు. వీరి చేరికతో మెదక్ బల్దియాలో కాంగ్రెస్ బలం 18కి చేరింది. ఈ సంఖ్య మరో రెండు రోజుల్లో పెరిగే అవకాశం ఉంది. ఇదే జరిగితే త్వరలోనే మెదక్ బల్దియా పీఠం కాంగ్రెస్ పరం కానుంది.

# రేపు కేరళకు రేవంత్ రెడ్డి

**ప్రచారంలో పాల్గొననున్న సీఎం** | **రెండు రోజుల పాటు అక్కడే**



**అమ్మన్యూస్, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు కేరళ వెళ్లనున్నారు. రెండు రోజుల పాటు ఆయన కేరళ రాష్ట్రంలో పర్యటించనున్నారు. అక్కడి లోక్సభ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఇది వరకు కేరళలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సమరాగ్ని ముగింపు యాత్రలో కూడా పాల్గొన్నారు. ఆ యాత్రలో రేవంత్ రెడ్డి పాల్గొనడంతో జనసంద్రాన్ని తలపించింది. అదిరిపోయే స్పీచ్ కూడా ఇచ్చాడు. తాజాగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా హస్తం శ్రేణులను సీఎం రేవంత్ రెడ్డి దిశ నిర్దేశం చేయనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రోజున రేవంత్ హైదరాబాద్ నుంచి కేరళకు బయల్దేరతారని పార్టీ వర్గాలు తెలిపాయి. అనంతరం ఈనెల 18వ తేదీన రాత్రి తిరిగి హైదరాబాద్ చేరుకుంటారని సమాచారం. 19న మహబూబ్నగర్, మహబూబాద్ సభల్లో ఆయన పాల్గొంటారని విశ్వసనీయ సమాచారం.

# బీజేపీ అభ్యర్థిగా వంశీ తిలక్

**కంటోన్మెంట్ ఉప ఎన్నిక అభ్యర్థి ఖరారు**



**అమ్మన్యూస్, హైదరాబాద్:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికకు బీజేపీ అభ్యర్థిని ప్రకటించింది. లాస్య నందిత ఆకస్మిక మృతితో ఖాళీ అయిన ఈ స్థానానికి బీజేపీ అభ్యర్థిగా వంశీ తిలక్‌ను ప్రకటించింది. ఈ మేరకు బీజేపీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కాగా ఈ ఏడాదిలో కంటోన్మెంట్ సిట్టింగ్ ఎమ్మెల్యే లాస్య నందిత కారు ప్రమాదంలో మృతి చెందారు. పటాన్‌చెరు శివారు ఓఆర్ఆర్‌పై ఆమె ప్రయాణిస్తున్న కారు రెయిలింగ్‌ను ఢీకొట్టడటంతో స్పాట్‌లోనే ప్రాణాలు కోల్పోయారు. ఆమె మృతితో కంటోన్మెంట్‌కు బైపోల్ అనివార్యమైంది. కంటోన్మెంట్ నుంచి బీఆర్ఎస్ తరుపున దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు నివేదితను ప్రకటించారు ఆ పార్టీ అధినేత కేసీఆర్. గత శాసనసభ ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన బీజేపీ అభ్యర్థి నారాయణ శ్రీ గణేశ్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరారు. దీంతో శ్రీ గణేశ్‌కే కాంగ్రెస్ టికెట్ దక్కింది. రెండు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటికే ఖరారైన నేపథ్యంలో బీజేపీ ఎవరిని ఎంపిక చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలోనే తమ అభ్యర్థిగా వంశీ తిలక్‌ను ఖరారు చేస్తూ ఆ పార్టీ నాయకత్వం ప్రకటన విడుదల చేసింది. కంటోన్మెంట్ నుంచి పోటీ చేసేందుకు బీజేపీకి చెందిన పలువురు నేతలు ఆసక్తి కనబర్చినా, సామాజిక, రాజకీయ అంశాల దృష్ట్యా వంశా తిలక్‌నే ఆ పార్టీ నాయకత్వం ఖరారు చేసినట్లు తెలిసింది. మే 13న లోక్‌సభ ఎన్నికలతో పాటే కంటోన్మెంట్ ఉప ఎన్నిక పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్ నుంచి లాస్య నందిత, కాంగ్రెస్ నుంచి గద్దర్ కూతురు వెన్నెల, బీజేపీ నుంచి శ్రీ గణేష్ పోటీ చేశారు. లాస్య నందిత శ్రీ గణేష్ పై 17,169 ఓట్ల తేడాతో గెలుపొందారు.

# రేపు వైన్ షాప్‌లు బంద్



**అమ్మన్యూస్, హైదరాబాద్:** రేపు మద్యం దుకాణాలను మూసి వేయాలని పోలీసు అధికారులు దుకాణ యజమానులను ఆదేశించారు. శ్రీరామనవమి సందర్భంగా పోలీసు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. రేపు ఉదయం ఆరు గంటల నుంచి 18వ తేదీ ఉదయం ఆరు గంటల వరకూ జంటనగరాల పరిధిలో ఉండే మద్యం దుకాణాలను బంద్ చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి నిర్ణయించారు. సీతారాముల కల్యాణం కావడంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఈ చర్యలు తీసుకున్నారు. మద్యం దుకాణాలను మూసివేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడంతో రేపటి కోసం ఇప్పటి నుంచే మందుబాబులు మద్యాన్ని కొనుగోలు చేయడానికి క్యూ కట్టారు. ఇక రేపు మద్యం దుకాణాలు తెరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థి సూసైడ్



**అమ్మన్యూస్, బాసర:** బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్టల్ గదిలో బుచ్చుక అర్వింద్ అనే విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. సిద్దిపేట జిల్లా తోగుట మండలం బండారుపల్లికి చెందిన బుచ్చుక అరవింద్ యూనివర్సిటీలో పీయుసీ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. ఏం జరిగిందో ఏమో కానీ సోమవారం అర్వింద్ తన గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వర్సిటీ సిబ్బంది సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు.. పోస్ట్ మార్టం కోసం అర్వింద్ మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి తల్లిదండ్రులకు యూనివర్సిటీ అధికారులు సమాచారం అందించారు. ఈనెల 18 నుండి పీయుసీ విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో ఒత్తిడికి గురై విద్యార్థి మృతి చెందాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# ఖమ్మం గుమ్మంలో

# వినోదరావు జోరు...

**బెంజు కారు వదిలి... మండే ఎండలో జనం కోసం** **అడుగడుగునా జననీరాజనాలు**







## అభివృద్ధి పూచీ నాది: బీజేపీ అభ్యర్థి వినోద్ రావు

గత పాలకులు అభివృద్ధిని విస్మరించి వెనుకబాటుకు కారణమయ్యారని, తనకు ఎంపీగా ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధికి పూచీ తనదని ఖమ్మం పార్లమెంట్ భాజపా అభ్యర్థి తాండ్ర వినోద్ రావు హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా తల్లాడ మండలం, బాలపేట్, అన్నారుగూడెం, బిల్లుపాడు గ్రామాలలో అయన మంగళవారం పర్యటించి ప్రసంగించారు. బాలపేట్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలను కలిసి కేంద్రంలో నరేంద్ర మోడీ గారి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అన్నారుగూడెం చేరుకున్నప్పుడు ప్రజలు డప్పుచప్పుళ్లతో, కళాకారుల కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వినోద్ రావు గారు మాట్లాడుతూ- గత ఎన్నికల్లో అన్ని పార్టీలకూ అవకాశం ఇచ్చిన ఓటర్లు మోసపోయారని, వచ్చే ఎన్నికలలో బీజేపీకి ఓటు వేసి తనకు అవకాశం కల్పిస్తే జిల్లాకు ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం బిల్లుపాడు గ్రామస్థులతో మాట్లాడుతూ- అయిదు వందల సంవత్సరాల అయోధ్య రామ మందిర కలను సాకారం చేసిన మహనీయుడు నరేంద్ర మోడీ గారని, మరో సారి బీజేపీకి అవకాశం ఇస్తే వచ్చే అయిదు సంవత్సరాలలో చేసే గణనీయమైన అభివృద్ధి సాధించి భారత్ ను తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతారని అన్నారు.

**(అమ్మన్యూస్, ఖమ్మం):** ఖమ్మం జిల్లా బిజెపి సాధారణ ఎన్నికలలో సత్తా చాటేందుకు పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో కమలం జోరు కొనసాగిస్తుంది. కాంగ్రెస్, కమ్యూనిస్టు ల కంచుకోట పిలవ పడుతున్న ఖమ్మం జిల్లాలో కమలం ప్రచారం హెూరెత్తితుంది. మూడవ సారి మోడీకి పట్టకంట్టేందుకు సిద్ధం అవుతున్న నేపథ్యంలో నెల రోజులు ప్రచారం ముందే ప్రచారం ప్రారంభించి క్షేత్రస్థాయిలో పర్యట ిస్తున్నారు .మండుటల సైతం లెక్కచేయకుండా గ్రామీణ ప్రజల చెంతకు చేరి ఎలాగైనా ఖమ్మం జిల్లా ఖిల్లాపై కాషాయ జెండా ఎగరవేయాలనే వ్యూహం తో ప్రత్యర్థులకు హడల్ ఎత్తి పొయ్యేలా ప్రచారం ముమ్మరం చేస్తున్నారు.

## పార్లమెంట్ ఎన్నికలో సత్తా చాటుదాం: బిజెపి జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ

పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో బిజెపి సత్తా చాటుతామని బిజెపి జిల్లా అధ్యక్షులు గల్లా సత్య నారాయణ అన్నారు. బూతులు ఎవరు స్థాయి కమిటీలు వేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన మోడీ పాలన లో చేసిన అభివృద్ధి చూసి ఓట్లు వేయాలని కోరారు . అయోధ్య రామయ్య అక్షింతలు ప్రతి కుటుంబానికి చేరువయ్యాయని ఆ కుటుంబమే తమకు శ్రీరామరక్ష అని తెలిపారు సత్తుపల్లి నియోజకవర్గంలో భారీ మెజార్టీ లభిస్తుందని ఆశ భారీ మెజార్టీ లభిస్తుందని ఆశ భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆపద రామారావు, పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ వీరంరాజ్లతో కలిసి మల్లారం గ్రామంలో ఇంటింటి ప్రచారం ప్రారంభించారు, గ్రామంలో జై శ్రీరామ్ నినాదాలతో గ్రామ ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, జిల్లా కార్యదర్శి సుదర్శన్ మిత్రా, జిల్లా అధికార ప్రతినిధి పగిడాల మధు, చావా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.







# మహిళామణులు అన్నం పెట్టే అమ్మలు

**గొంతులు తడిపే గంగమ్మ తల్లులు.. మహిళలతో రంజిత్ రెడ్డి సమావేశం**

**అమ్మన్యూస్, చెవేళ్ల:** సార్వత్రిక ఎన్నికల కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రజాక్షేత్రంలో వడివడిగా కదులుతున్నారు. రాజకీయ పక్షాలకు చెందిన నాయకులు నియోజకవర్గాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పాగా వేయాలనే లక్ష్యంతో ప్రచారంలో జోరును పెంచుతున్నారు. చెవేళ్ల పార్లమెంట్ స్థానంలో హస్తం జెండా రెపరెపలాడేలా కాంగ్రెస్ పార్టీ వ్యూహాలు రచిస్తోంది. అందులో భాగంగానే చెవేళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి వినూత్న రీతిలో ప్రజల్లోకి వెళుతున్నారు. మంగళవారం రాజేంద్ర నగర్ నియోజకవర్గం షాపూర్ గ్రామంలో మహిళలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. మహిళామణులు మనకు అన్నం పెట్టే అమ్మలు, తల్లులు.. మన గొంతులు తడిపే గంగమ్మ తల్లులు.. తప్పు చేస్తే తలకాయ తెంచే కాళికామాతలు.. మీకు శతకోటి దండాలు తెలియజేశారు. ఈ సమావేశంలో స్థానిక నియోజకవర్గ కస్తూరి నరేందర్, టీటీడీ బోర్డు సభ్యురాలు సీతా రంజిత్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు ధ్వజస్తంభం శిఖర ప్రతిష్ట మహెూత్సవం కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గం మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామస్థులు ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమానికి స్థానిక నియోజకవర్గ ఇంఛార్జ్ భీం భరత్‌తో పాటు తనను కూడా ఆహ్వానించారు.



# గల్ఫ్ కార్మికులకు బీమా సౌకర్యం

**వారి సమస్యలకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు**

**కార్మికుల హక్కులు కాపాడుతాం**

**సీఎం రేవంత్ రెడ్డి**

**గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులతో భేటీ**



**అమ్మన్యూస్, హైదరాబాద్:** గల్ఫ్ కార్మికులకు న్యాయపరమైన సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి ఉత్తర తెలంగాణ నుంచి ఎక్కువ మంది గల్ఫ్ కార్మికులు ఉన్నారన్నారు. ఏజెంట్ల బారిన పడి కొందరు, యాజమాన్యం చేతిలో మరికొందరు కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లే కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. ప్రజా భవన్‌లో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఒక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేసే వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. సెప్టెంబర్ 17 లోగా వారి సమస్యల పరిష్కారానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేసే బాధ్యత తమ దేనన్నారు. ఫిలిప్పీన్ విధానాలను తాము స్పష్టంగా అధ్యయనం చేసామన్నారు. కార్మికుల హక్కులు కాపాడేందుకు ఆ దేశమే ఇతర దేశాల వ్యవస్థలతో మాట్లాడుతుందన్నారు. కేరళ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా అధ్యయనం చేసామని, ఇప్పటికే గల్ఫ్ కార్మికుల కోసం ఒక పాలసీ డాక్యుమెంట్ తయారు చేసామని అన్నారు. ఎన్నికల కోడ్ ముగిశాక ప్రభుత్వం తరఫున మిమ్మల్ని ఆహ్వానిస్తామని, పాలసీ డాక్యుమెంట్ పై వారి అభిప్రాయాలను, సూచనలను తీసుకుని ముందుకు వెళ్తామన్నారు. ఏజెంట్ల చేతిలో మోసపోకుండా చర్యలు తీసుకోబోతున్నామని తెలిపారు. ఏజెంట్లు రాష్ట్ర ప్రభుత్వం వద్ద నమోదు చేసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గల్ఫ్ వెళ్లే వారికి ఒక వారం రోజులు శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. రైతు బీమాలాగే గల్ఫ్ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మీ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు జీవన్ రెడ్డికి ఇవ్వాలని సూచించారు. పార్లమెంట్‌లో మీ సమస్యలపై గొంతు వినిపించేందుకు నిజామాబాద్ పార్లమెంట్‌లో కాంగ్రెస్‌ను గెలిపించండని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

# కడియం కాస్కో.. ఇక కబడ్డీ ఆడుడే..

**నిప్పులు చెరిగిన మాజీ మంత్రి తాటికొండ రాజయ్య**

**(అమ్మన్యూస్, హైదరాబాద్):** స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ మంత్రి తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. వరంగల్‌లో జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'బిడ్డా కాస్కో.. ఇక మధ్య కబడ్డీ.. కబడ్డే.. తగ్గేదే లే అంటూ సవాల్ విసిరారు. దమ్ముంటే రా.. స్టేషన్ ఘనపూర్‌లో నువ్వు చేసిన అభివృద్ధి.. నేను చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. విదేశాల్లో కడియం శ్రీహరికి ఆస్తులున్నాయని.. ఆ అక్రమ ఆస్తులకు కావ్య, ఆమె భర్త నజీర్ బినామీలుగా ఉన్నారన్నారు.

ఇక్కడ దోచుకున్న డబ్బులతో మలేషియా, సింగ్‌పూర్‌లో అక్రమాస్తులు కూడబెట్టారన్నారు. హవాలా రూపంలో డబ్బు విదేశాలకు తరలించారని ఆరోపించారు. తనకు లొంగనివాళ్లను ఎన్ కౌంటర్ చేయించిన దుర్మార్గుడు కడియం అంటూ మండిపడ్డారు. మంత్రిగా ఉన్నప్పుడు డీఈఓల బదిలీల్లో రూ. 2కోట్లు, లింగంపల్లి ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ వద్ద రూ. 6 కోట్లు వసూలు చేశారని మండిపడ్డారు. పేకాట ఆడుతూ దొరికితే పోలీస్ స్టేషన్‌లో కూర్చో బెట్టలేదా? సోషల్ వెల్ఫేర్ మంత్రిగా ఉండి అమాయక పిల్లల పొట్టకొట్టి కోట్లు దోచుకున్న చరిత్ర కడియం శ్రీహరిదని విమర్శించారు. నాలుగుసార్లు ఓడిపోయిన కడియం శ్రీహరి తన గురించి మాట్లాడడానికి సిగ్గులేదా? అంటూ విమర్శించారు. నవ్వు ఎక్కడ పుట్టినవ్? ఎక్కడ పెరిగినవ్..? జీవిత చరిత్ర మొత్తం త్వరలోనే బయటపెడతానని రాజయ్య అన్నారు.



## అందం తెచ్చిన కీర్తి కిరీటం

మలయాళ సినిమాతో తన కెరియర్ ను మొదలుపెట్టిన కీర్తి సురేశ్, ప్రస్తుతం తెలుగు .. తమిళ .. మలయాళ సినిమాలతో బిజీగా ఉంది. కీర్తి సురేశ్ నటనకి స్కోప్ ఉన్న పాత్రలను ఎక్కువగా ఎంచుకుంటూ ముందుకు వెళుతోంది. క్రితం ఏడాది ఆమె చేసిన సినిమాలలో, తమిళంలో 'మా మన్నన్' .. తెలుగులో 'దసరా' ఆమెకి భారీ విజయంతో పాటు ప్రశంసలను తెచ్చిపెట్టాయి. ప్రస్తుతం ఆమె చేతిలో నాలుగు తమిళ సినిమాలు .. ఒక హిందీ మూవీ ఉన్నాయి. తాజాగా కీర్తి సురేశ్ నుంచి వచ్చిన ఫొటోస్ ను చూస్తే, ఆమె మరింత అందంగా కనిపిస్తోంది.

# దేశాన్ని, ధర్మాన్ని రక్షిస్తున్నది మోదీనే

**కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



భారతదేశాన్ని హిందూ ధర్మాన్ని రక్షిస్తున్న ఏకైక నాయకుడు నరేంద్ర మోడీ మాత్రమే అన్నారు బిజెపి చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి. వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బిజెపి ప్రజా ఆశీర్వాద సభలో ఆయన పాల్గొన్నారు. సందర్భంగా కుండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీకి పోటీనే లేదన్నారు. దేశము మొత్తం ఫిర్ ఏక్ బార్ మోడీ సర్కార్ అంటూ నినదిస్తోందన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ప్రజలందరికీ అన్ని ఇస్తున్న ప్రతిపక్షాలు మాత్రం ఏమి ఇవ్వడం లేదని దుష్ప్రచారం చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. గ్రామాల్లోని పంచాయతీలకు సర్పంచ్లకు నేరుగా కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందన్నారు. ఆ నిధులతోనే గ్రామ గ్రామాన రైతు వేదికలు, వైకుంఠ ధామాలు నిర్మించారని కొండా విశ్వేశ్వర్ రెడ్డి తెలిపారు. కానీ గత ప్రభుత్వం మాత్రం ఆ విషయాలు ప్రజలకు చెప్పకుండా కాళేశ్వరాలు, కుంభకోణాలతో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆయన చెప్పారు. ఉదయం 4 గంటలకు నిద్ర లేచే మోడీ రాత్రి 11 గంటల వరకు దేశం కోసం పని చేస్తున్నారని అలాంటి నాయకుడే మరోసారి ప్రధాని కావాలని ఆకాంక్షించారు. 2024 వరకు భారతదేశ అన్ని ప్రపంచంలో నెంబర్ వన్ దేశంగా తీర్చిదిద్దేందుకు మోదీ పాటుపడుతున్నారని అన్నారు.

## కాంగ్రెస్ ఖతం

**కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే ప్రజలంతా ఆగం కావాల్సిందేనన్నారు కొండా విశ్వేశ్వర్ రెడ్డి. కాంగ్రెస్ పార్టీ అటు కర్ణాటక ఇటు తెలంగాణలో గ్యారంటీలు ఇచ్చి ఒక గ్యారెంటీని కూడా పూర్తి చేయలేదని ఆయన ఆరోపించారు. రెండు లక్షలు రుణ మాఫీ చేస్తానన్న రేవంత్ రెడ్డి రెండు పైసలను కూడా మాఫీ చేయలేదని ఎద్దేవా చేశారు. మహిళలకు 2500 రూపాయల నగదు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. 2500 రూపాయలు ఇవ్వలేని కాంగ్రెస్ నాయకులు లక్ష రూపాయలు ఎలా ఇస్తారని ఆయన విమర్శించారు. ఉచిత బస్సు టికెట్ ఇచ్చి మొత్తం ఇచ్చినట్టుగా కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు.**

# సెంటిమెంట్ హోరు.. కాసాని జోరు

**చేవెళ్లలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్** | **అన్నీతానై నడిపిస్తున్న సబితక్క**

**(అమ్మన్యూస్, హైదరాబాద్):** చేవెళ్ల సెంటిమెంట్ లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ దూసుకుపోతోంది. అన్ని ప్రధాన పార్టీల కంటే గులాబీ దళం ముందుంది. పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సీనియర్ నేతలను, పార్టీ శ్రేణులను ఒక్క తాటిపైకి తీసుకువచ్చి ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజల్లోంచి సైతం మంచి ఆదరణ వస్తోంది. అన్ని రాజకీయ పార్టీలు ఇక్కడి నుంచే కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభిస్తూ వస్తుండగా..బీఆర్ఎస్ సైతం లోక్‌సభ ఎన్నికల్లో అదే అస్త్రాన్ని ప్రయోగించింది. వైఎస్ గెలుపునకు చేవెళ్ల సెంటిమెంట్‌గా నిల్వగా..గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ చేవెళ్ల వేదికగా సభలు, సమావేశాలను నిర్వహించి అధికారంలోకి వచ్చింది.

బీజేపీ సైతం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇదే ప్రాంతంలో సభను నిర్వహించింది. జాతీయ స్థాయి నేతలు సైతం ఈ సభల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలకు చేవెళ్ల సెంటిమెంట్‌గా మారింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సైతం లోక్‌సభ ఎన్నికల్లో ఇదే సెంటిమెంట్‌ను అనుసరించాలని సంకల్పించి చేవెళ్ల నుంచే లోక్‌సభ ప్రచారాన్ని మొదలు పెట్టాలని నిర్ణయించి తొలిసభను ఇక్కడే నిర్వహించారు. ఈ సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో రాష్ట్రం అంతటా బీఆర్ఎస్‌లో జోష్ నెలకొంది. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మొదటి నుంచీ ముందుండి నడిపిస్తూ క్యాడర్‌లో కొత్త ఉత్తేజాన్ని నింపుతూ వస్తున్నారు. చేవెళ్ల సభ సక్సెస్




కావడంలోనూ కీలకపాత్ర పోషించారు. సభ తేదీ ప్రకటించిన నాటి నుంచే ముఖ్యనేతలతో సమాలోచనలు జరపడమే కాకుండా.. ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ సభ సక్సెస్‌కు తనవంతు పాత్ర పోషించారు.సభ సక్సెస్ కోసం సన్నాహక సమావేశాలు సైతం నిర్వహించారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండలాలు, గ్రామాల వారీగా నేతలకు బాధ్యతలు అప్పగించారు. ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున తరలివచ్చి కేసీఆర్‌కు భరోసా ఇవ్వడంతోపాటు ఎంపీ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌ను ఆశీర్వదించాలని ఇచ్చిన పిలుపునకు జనం స్పందించి అశేషంగా తరలివచ్చారు.